క్లుప్తంగా

నేడు గౌరీశంకరుల కల్యాణం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని గౌరీశంకర ఆలయం వద్ద గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 18న శివరాత్రి పురస్కరించుకుని గురువారం రాత్రి కర్రి పైడా రావు, శ్రీవాణి దంపతులు కళ్యాణ కర్తలుగా స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణానికి భక్తులు తరలిరావాలని కోరారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శ్రీనివాస వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను బుధవారం పంపిణీ చేశారు. బాలింతలు, గర్భిణులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించి వారికి పలకలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐనపర్తి కనక దుర్గ, హెల్పర్ జి.వెంకట విజయలక్ష్మి, వార్డు మెంబర్ రాయుడు వీర్రాఘవులు, మురముళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

పెదపూడి: మండలంలోని 20 సచివాలయాల పరిధిలో గురువారం ఎలుకల నివారణకు ఉపయోగించే బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమానికి రైతు సోదరులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దంపతులపై దాడికి యత్నం!

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన వేముల ఆంజనేయులు దంపతులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి యత్నించారు. ఆంజనేయులు బుధవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యతో కలిసి ఆంజనేయులు మోటారు సైకిల్‌పై మంగళవారం ద్వారపూడిలో వివాహానికి వెళ్లారు. వివాహ అనంతరం అదేరోజు తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికీ రాత్రి 9.45 గంటల సమయంలో నల్లని టీషర్టు, ఫ్యాంట్ వేసుకుని, ముఖానికి మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వారి మోటారు సైకిల్‌కు అడ్డువచ్చి నిలువరించాడు. అదే సమయంలో వెనుక నుంచి ఇద్దరు వ్యక్తులు పరుగున రాసాగారు. వీరిని గమనించిన ఆంజనేయులు వేగంగా మోటారు సైకిల్‌ను ముందుకు పోనిచ్చాడు. వెనుక వచ్చిన ఓ వ్యక్తి చేతితో కొట్టడానికి ప్రయత్నించినా.. వీరు అందకుండా ముందుకు వెళ్లిపోయారు.

నేడు గృహసారథులకు శిక్షణా కార్యక్రమం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గృహసారథులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జేసీఎస్ మండల ఇన్‌చార్జ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఒత్తిడికి దూరంగా ఉంటే విజయమే

మధురపూడి: ఒత్తిడికి దూరంగా ఉంటే విజయం తప్పక సాధించవచ్చని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. కోరుకొండ మండలం దోసాకాయలపల్లి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. పరీక్ష పర్వే 4.0 కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతుడికి అరటి పండ్లతో అలంకరణ


మెళ్లూరులో అరటి పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామిని అరటి పళ్ళతో ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం ఆలయం వద్ద వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీరామ సప్తాహం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రీతికరమైన అరటిపళ్ళతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ దూళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గీతాగానం చిత్ర ప్రదర్శన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ నటించిన గీతాగానం చిత్రాన్ని గురువారం థియేటర్లో ప్రదర్శించనున్నారు. బుర్రకథ కళాకారులైన విభూతి లోవరాజు, విభూతి శ్రీనివాసరాజు, విభూతి రాంప్రసాద్ ఈ చిత్రంలో నటించారు. ఊర్వశి కాంప్లెక్స్‌లోని రంభ థియేటర్లో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఈ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

- వంగలపూడి నుంచి పట్టిసీమకు దారి ఏర్పాటు
- టెంట్లు, బారికేడ్లు, వసతుల కల్పన

సీతానగరం: మహాశివరాత్రి పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు (గతంలో పశ్చిమ గోదావరి) జిల్లాలోని పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తుల కోసం గోదావరిలో దారి ఏర్పాటు చేశారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయ ఉంది. దానిపై పంచాయతీ ఆధ్వర్యంలో దారి ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి శనివారం రావడం, శనిత్రయోదశి కావడంతో ఇక్కడి నుంచి లక్షమందికి పైగా భక్తులు పట్టిసీమకు వెళ్లే అవకాశం ఉంది. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరు దూరం గోదావరి దాటిన తరువాత అక్కడ నుంచి సుమారుగా నాలుగు కిలోమీటర్లు ఇసుకలో నడిచి వీరభద్రుని ఆలయానికి చేరుకోవాలి.

వాహనాల ఏర్పాటు

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచనల మేరకు భక్తుల కోసం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులు తరలివెళ్లడానికి వంగలపూడి పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. నడవలేని భక్తులకు రేవు నుంచి గోదావరి పాయ వరకు ట్రాక్టర్‌పై తరలించడానికి ఒకరి రూ.30, అక్కడి నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం వరకు రూ.50 వసూలు చేస్తారు.


వంగలపూడిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సత్యనారాయణరాజు

అన్ని సౌకర్యాలు

ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, పంచాయతీరాజ్ జేఈ ప్రసాద్, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి నాగ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, నీరుకొండ శ్రీనివాస్, గోలి శ్రీను, సూరెడ్డి పోశియ్య, అంబటి రమణ తదితరులు భక్తులకు కల్పించే సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. రేవు వద్ద సైకిల్ స్టాండ్‌ను రూ 45,200కు చొక్కామౌళి, ట్రాక్టర్లపై భక్తులను తరలించడానికి రూ.60 వేలకు రమేష్ (బుజ్జి) పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో పాటను దక్కించుకున్నారు. సైకిల్ స్టాండ్‌లో టూవీలర్లకు రూ.30, కార్లకు రూ.100, ఆటోకు రూ.40 చొప్పున వసూలు చేయడానికి నిర్ణయించారు. ఎంపీడీవో, తహసీల్దార్లు వివిధ శాఖాధికారులతో మహాశివరాత్రి సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. వంగలపూడి రేవు వద్ద భక్తుల సౌకర్యార్థం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీరు, భక్తులకు మరుగుదొడ్లు, గోదావరి పాయ వద్ద బారికేడ్లు, పోలీస్ బందోబస్తు, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కరెంట్ సరఫరా, లైట్ల ఏర్పాట్లు, గోదావరి పాయపై వేసిన వారధి అంచులకు ఇసుక బస్తాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.


పట్టిసీమ వెళ్లడానికి వంగలపూడి రేవు నుంచి గోదావరిపై ఏర్పాటు చేసిన దారి

వసతులు బాగున్నాయి


వంగలపూడి రేవు నుంచి పడవలపై గోదావరి దాటి వెళ్లేవాళ్లం. ఈ ఏడాది నేరుగా భక్తులు నడిచి వెళ్లడానికి రోడ్డు మార్గం ఉంది. నడవలేని వారు ట్రాక్టర్లపై వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టిసీమ వీరభద్రుని దర్శనం చేసుకునే భక్తులకు అన్ని వసతులు కల్పించారు.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, మిర్తిపాడు

అన్ని ఏర్పాట్లు చేశాం


రేవు నుంచి భక్తులు తరలివెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వాహనాల పార్కింగ్‌కు సైకిల్ స్టాండ్, భక్తులు తరలివెళ్లడానికి ట్రాక్టర్లు ఏర్పాట్లు చేశాం. దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం రేవులో నిర్వహిస్తాం. ఇవే కాకుండా పలు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– కొంచ అన్నపూర్ణ, సర్పంచ్, వంగలపూడి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: శ్రీరామపురంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగన్మాత ఆశీసులు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనకు శ్రీరామపురం, దివాన్‌చెరువు, శ్రీకృష్ణపట్నం, పుణ్యక్షేత్రం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

వికాస్ కాలేజీలో ఫ్రెషర్స్‌డే

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో బుధవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.సుమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫార్మసీ అసోసియేషన్ (ఐపీఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఔషధం గురించి తెలుసుకునేందుకు ఫార్మావిద్య బాగుంటుందని, దీనిలో చేరిన విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గృహసారథులే సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గృహసారథుల శిక్షణ, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం
- పాల్గొన్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సుబ్బారావు

రంగంపేట: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే జగనన్న రథ సారథులని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సుభ్రంపేట గ్రామంలో గృహసారథులకు శిక్షణ, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కరోనా కష్టకాలంలో దేశమంతా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ఎలాంటి లోటు తెలియకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగించారన్నారు. పార్టీలకు అతీతంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అన్నారు. గృహసారథులు వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిలో గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గమనించమని తెలిపే కరపత్రాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.


సుభద్రంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అంతా మాఇష్టం..

- విమానాశ్రయం రోడ్డుపై క్రేన్ ఏర్పాటు
- చంద్రబాబు పర్యటన కోసం టీడీపీ నాయకుల అత్యుత్సాహం
- రాకపోకలకు ప్రజల అవస్థలు

మధురపూడి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనతో బుధవారం ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. మధురపూడిలోని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చే ఆయనకు గజమాల వేసి సత్కారం చేయాలని టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం జాతీయ రహదారి 516ఇపై క్రేన్‌ను అడ్డంగా ఉంచారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఆ పార్టీ నాయకుడు ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఏర్పాటు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రాజమహేంద్రవరం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు వెళ్లాల్సిన, అటువైపు నుంచి వచ్చే వాహనాలన్నీ గంటల తరబడి నిలిచిపోయాయి.


ఎయిర్‌పోర్టు ఎదురుగా రోడ్డుపై ఏర్పాటు చేసిన క్రేన్

ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలి

రంగంపేట: పాఠశాలల సమగ్ర విద్యాభివృద్ధిలో అందరూ భాగస్వాములై ప్రభుత్వ లక్ష్య సాధనకు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.రామరాజు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజన పథకం, మన బడి నాడు–నేడు కార్యక్రమాలు విజయవంతం చేయడంలో అందరూ కృషి చేయాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తీసుకోవలసిన కార్యచరణ ప్రణాళిక గురించి ఎంపీడీఓ రామరాజు, తహసీల్దార్ అమ్మాజీలు సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, ఏపీఎం బి.అబ్బులు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు, వైద్య, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం


మహేంద్రవాడలో సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

అనపర్తి: రోజూ సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రోజంతా చురుకుగా ఉంటారని మండలంలోని మహేంద్రవాడ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల అన్నారు. మండలంలోని కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మహేంద్రవాడ, కుతుకులూరు గ్రామాల్లో సైకిల్ ఫర్ హెల్త్‌పై అవగాహన, సైకిల్ ర్యాలీలు చేపట్టారు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సైకిళ్లపై తిరుగుతూ సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, పాఠశాల ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, రాంబాబు, కృష్ణాంజనేయులు, ఏఎన్ఎం జ్యోతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రైతులకు శిక్షణ

కడియం: మేలైన పంటల యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నుంచి మూ డు రోజుల పాటు రైతులకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చి మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం), ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనకు కె.గంగవరం తీసుకువెళతారన్నారు.

గడ్డి మేటు దగ్ధం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీ – బుర్రిలంక రోడ్డులోని ఆదిత్య నర్సరీలో ఉన్న గడ్డిమేటు బుధవారం కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల ఆస్తినష్టం సంభవించింది. ఉద్దేశపూర్వకంగా కొందరు గడ్డిమేటుకు నిప్పు పెట్టారని నర్సరీ రైతు పాటంశెట్టి వెంకట రమణ కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమన్వయంతో గృహప్రవేశాలు

మధురపూడి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇచ్చిన స్థలాల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలని కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ అన్నారు. బుధవారం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో నరేష్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ స్థలాలు పొందిన పేదలు గృహ ప్రవేశాలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొయిదాల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లి బుజ్జిబాబు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఆంధ్రా షిర్డీగా పేరుగాంచిన సాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 5.15 నిమిషాలకు కాగడా హారతితో స్వామి వారి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం గణపతి పూజ, గణపతి హోమం, దత్తాత్రేయ పూజ, ధుని పూజ, బాబా మూలవిరాట్‌కు 108 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.


బలభద్రపురం షిర్డీ సాయిబాబా

ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్ తల్లి సూర్యావతిని ద్వారకా తిరుమల ట్రస్టుబోర్డు డైరెక్టర్‌గా నియమించడంపై రాజమహేంద్రవరం నగర కాపు సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఇందుకు కృషి చేసిన వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు ఆ సంఘ ప్రముఖులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి తరలివచ్చారు. రాబోయే కమిటీలలో కూడా కాపులకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర కాపు సంఘం ఉపాధ్యక్షుడు చవ్వాకుల రంగనాథ్, జనరల్ సెక్రటరీ వక్కపాటి మురళి, ఆర్‌వీ బాబ్జీ, మానె దొరబాబు, జవ్వాది సూర్య పాల్గొన్నారు.


ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న కాపు నాయకులు

ప్రమాదకరంగా వంతెనలు

- తరచూ ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

గోకవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వంతెనలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. గోకవరం ఠాణాసెంటర్‌లో ఊరకాలువపై ఉన్న వంతెనతో పాటు రంపయర్రంపాలెం వెళ్లే గ్రామంలో బురదకాలువపై ఉన్న వంతెనల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఠాణాసెంటర్‌లో ఊరకాలువపై ఉన్న వంతెన బ్రిటిషు కాలం నాటిది. వంతెన ఇరుకుగా ఉండటం, బ్రిడ్జికి ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పదేళ్లుగా ఈ వంతెనపై జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా, అనేక మంది గాయాలపాలయ్యారు. దీంతో ఈ వంతెన మీదుగా వెళ్లెందుకు ప్రయాణికులు తీవ్ర భయాందోళ చెందుతున్నారు. ఇటీవల వంతెన రక్షణ గోడ సైతం శిథిలావస్థకు చేరింది.

వేలాది వాహనాల రాకపోకలు

రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వైపు, వివిధ రాష్ట్రాలకు నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపైకి ఒకేసారి రెండు వాహనాలు వస్తే ట్రాఫిక్ నిలిచిపోయి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు నిత్యం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరేళ్ల క్రితం ఈ వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణం జరగలేదు. అలాగే గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో బురదకాలువపై ఉన్న వంతెన ప్రమాదభరితంగా మారింది. ఈ వంతెనను సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించారు. వంతెన నిర్మించిన సమయంలో వంతెనకు ఇరువైపులా సిమ్మెంటు దిమ్మలను రక్షణగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వంతెనపై పలు చోట్ల సిమ్మెంటు దిమ్మలు శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. దీంతో వంతెనపై ప్రయాణం దినదినగండంగా మారింది. ఇప్పటివరకూ ఈ వంతెనపై నుంచి కింద పడి ముగ్గురు వక్తులు మృత్యువాత పడ్డారు. అలాగే పలు వాహనాలు అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం ఈ వంతెనపై రంపయర్రంపాలెం, గంగంపాలెం, ఠాకూరుపాలెం, తిరుమలాయపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ప్రమాదభరితంగా మారడంతో వీరు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఠాణాసెంటర్ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని, బురదకాలువపై వంతెనకు రక్షణగోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


బురదకాలువపై రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన


గోకవరంలో ప్రమాదకరంగా ఉన్న ఠాణా సెంటర్ ఇరుకు వంతెన